

# ఏయూ లుక్స్

తెలుగు వార పత్రిక

ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్నం, ఆంధ్ర ప్రదేశ్

ANDHRA UNIVERSITY
Accredited by NAAC With 'A' Grade
ISO 9001:2015 Certified

aulooks@andhrauniversity.edu.in
aulooks.vizag@gmail.com

ఫోన్ : 0891- 2844000

15-21 జనవరి, 2023

Chief Patron : Prof. P.V.G.D. Prasad Reddy | Chief Editor Prof. K.Samatha | Publisher : Prof. V.Krishna Mohan

సంపుటి : 1 | సంచిక : 49 | పేజీలు : 8




# కలల భవిష్యత్‌కు... పూల బాట..!

- ఏయూలో అడుగు పెట్టిన నూతన విద్యార్థులు
- ఆహ్వానం పలుకుతున్న పలు యూనివర్సిటీ వసతులు
- ఈ ఏడాది రికార్డు స్థాయిలో సీట్లు భర్తీ
- వసతులు వినియోగంతో భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలి
- ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి

ఎందరో విద్యార్థుల్ని మేధావులుగా తీర్చిదిద్దిన చదువుల నిలయం ఆంధ్ర విశ్వవిద్యాలయం. భవిష్యత్‌పై గంపెడాశతో వర్సిటీ ప్రాంగణం లోకి అడుగుపెట్టే విద్యార్థులను శాస్త్ర వేత్తలుగా, విద్యా వేత్తలుగా, ఉన్నతాధికారులుగా, రాజకీయవేత్త లుగా తీర్చిదిద్దిన ఘనత దీని సొంతం. దేశానికి ప్రథమ పౌరుణ్ణి అందించినా.. తెలుగువాడిని నోబెల్ విజేతగా నిలిపినా పొంగిపోని ఈ సరస్వతి నిలయం తన 98 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానం లో సాధించిన ఘనతలెన్నో. ఇంతటి కీర్తి నొందిన ఏయూలో చదువు కోవడం ప్రతి విద్యార్థికీ ఓ స్వప్నం. ఇలా రెండేళ్ల పాటు ఈ చదువులమ్మ ఒడిలో విద్యాబుద్ధులు నేర్వడానికి ఆశగా అడుగు పెట్టిన నూతన విద్యార్థులకు ఇక్కడున్న సౌకర్యా లు ఆహ్వానం పలుకుతున్నాయి. ఆయా సౌకర్యాలపై అవగాహనతో పాటు వర్సిటీ యంత్రాంగం దిశానిరద్దేశం పై ఏయూ లుక్స్ ప్రత్యేక కథనం.

వివరాలు 2, 3 పేజీలలో

## మీ ప్రత్యేకతను వెలికి తీయండి

మీ భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకోడానికి ఆంధ్ర విశ్వవిద్యాలయం అద్భుతమైన వేదిక.

ప్రతి విద్యార్థి ఈ వేదికను సద్వినియోగం చేసుకోవాలన్నది మా ఆకాంక్ష.

అందుకు అనుగుణంగా విద్యార్థులను నడిపించేందుకు ముందస్తు విజన్‌తో పనిచేస్తున్నాం.

క్యాంపస్‌లో చదువు పూర్తయ్యేసరికి ప్రతి విద్యార్థి కొలువు సాధించాలని సంకల్పిస్తున్నాం.

గురువుగా, సహచరుడిగా, స్నేహితుడిగా ప్రతి విద్యార్థిని వెన్ను తట్టి ప్రోత్సహించే బాధ్యత ఇక్కడి ఆచార్యులు అందరిదీ.

ప్రతి విద్యార్థిలోనూ ప్రత్యేకత ఉంటుంది. దానిని బయటకు తీయండి. మీకలను సాకారం చేసుకొనేందుకే శ్రమించండి.

ప్రతి విద్యార్థికి ఒక మీనింగ్‌ఫుల్ యాక్టివిటీ, ప్రత్యేకమైన మైండ్ సెట్ ఉండాలి.

ఏ విద్యార్థి సమయాన్ని వృథా చేసుకోవద్దు.

యూనివర్సిటీ వాతావరణం సరికొత్త మార్పును తీసుకురావాలి.

మీకోసం మీరే అభివృద్ధి ప్రణాళికను రచించుకోండి.

అభివృద్ధి ప్రణాళిక లేకుంటే జీవితంలో గెలుపు అసాధ్యం.

ఐడియాలజీ, పరిశోధనాత్మకత, ప్రశ్నించే తత్వం, నేర్చుకోవాలనే శ్రద్ధ ప్రతి విద్యార్థిలోనూ ఉండాలి.

ఫిక్స్‌డ్ మైండ్ సెట్ సరికాదు.

ప్రాధాన్యాలు మారుతుంటాయి. కాని లక్ష్యం కాదు. అనే విషయాన్ని గుర్తుంచుకోండి.

హెల్త్, కమ్యూనికేషన్ స్కిల్స్, బాడీ లాంగ్వేజ్ ఇలా అన్నింటిలోనూ కొత్తదనం సంతరించు కోండి.

మీ విజయంలో మీ నేమ్, మీ ఫేమ్ కనిపించాలి. తద్వారా మీ తల్లిదండ్రులకు, యూనివర్సిటీకి, సమాజాని కి మంచి గుర్తింపు రావాలి.

భవిష్యత్ ప్రపంచం ఉరకలెత్తే యువత కలిగిన భాంతదేశానిదే అనే విషయాన్ని మర్చిపోకండి.



ఆచార్య ప్రసాదరెడ్డి, వైస్ ఛాన్సలర్

---

మధ్యవర్తిత్వంతో

## వివాదాలు పరిష్కారం

**సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు**




ఏయూ న్యూస్, జనవరి : మధ్యవర్తిత్వంతో వివాదాల పరిష్కారం సాధ్యపడుతుందని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వర రావు అన్నారు. బుధవారం ఉదయం ఏయూ న్యాయ కళాశాల సమావేశ మందిరంలో నిర్వహించిన 'జస్టిస్ జాస్తి చలమేశ్వర్ ఎండోమెంట్ లెక్చర్'లో భాగంగా ఆయన 'మ్యూజింగ్స్ ఆఫ్ మీడియేషన్' అంశంపై ప్రసంగించారు. ఈ సందర్భంగా జస్టిస్ లావు నాగేశ్వర రావు మాట్లాడుతూ మధ్యవర్తిత్వం వలన సమయం, ఖర్చు ఆదా అవుతుందన్నారు. ఈ ప్రక్రియలో ఎవరూ నష్టపోవడం, లాభపడటం జరగదన్నారు. ఇరు పార్టీ మధ్య సత్సంబంధాలను పునరుద్ధరించడానికి

తరువాయి 6లో

---

## విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించండి

**ఏయూను సందర్శనలో సెయింట్ టెక్నాలజీస్ వ్యవస్థాపకుడు బీవీఆర్ మోహన్‌రెడ్డి**

**ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డితో సమావేశం**

**ఇంజినీరింగ్ కాలేజి డ్రీమ్ వాల్ కాన్సెప్ట్‌పై ప్రశంస**




సక్సెస్‌ఫుల్ లెజండరీస్ తో కూడిన డ్రీమ్ వాల్ కాన్సెప్ట్‌లో బీవీఆర్ మోహన్ రెడ్డి చిత్రం

ఏయూ న్యూస్, జనవరి :విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించాలని సెయింట్ టెక్నాలజీస్ వ్యవస్థాపక చైర్మన్ బి.వి.ఆర్ మోహన రెడ్డి అన్నారు. జనవరి 10న ఆయన ఏయూను సంధర్శించారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు స్ఫూర్తిని నింపే విధంగా ఏర్పాటు చేసిన డ్రీమ్‌వాల్‌ను ఆయన సందర్శించడంతో పాటు, ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డితో సమావేశమ య్యారు. విభిన్న రంగాల్లో అత్యున్నత ప్రగతిని సాదించిన వారి



చిత్రాలతో ఏర్పాటు చేసిన డ్రీమ్ వాల్ కన్సెప్ట్ యువతలో స్ఫూర్తిని నింపేదిగా ఉందన్నారు. భవిష్యత్తులో వారు అటువంటి స్థానాలకు చేరుకోవాలనే తృష్ణను కలిగించే దిశగా నిలుస్తుందన్నారు. విద్యార్థులను దిశ నిర్దేశంపై పలు విషయాలను వీసీతో చర్చించారు. అనంతరం ఏయూలో ఏర్పాటైన ఇంక్యుబేషన్ సెంటర్, నాస్‌కామ్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్, ఫుడ్, ఫార్మ ఇంక్యుబేషన్, ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ తదితర కేంద్రాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డితో కార్యాలయంలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం నవ్య చరిత్రను లిఖించే దిశగా అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్న విధానం తనకు అమితమైన ఆనందాన్ని,

తరువాయి 5లో

ఏయూ లుక్స్ తెలుగు వార పత్రిక

ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్నం, ఆంధ్ర ప్రదేశ్




# కలల భవిష్యత్‌కు పూలబాట..!

## ఏయూ వ్యాయామశాల

ఆధు నాతన వ్యాయామ శాల ఏయులో అందు బాటులో ఉంది. యువతకు విజ్ఞానంతో పాటు శరీక పౌష్టవం అవసరమని భావించిన ఉన్నతాధికారులు దశాబ్దాల క్రితమే శ్రీ కోడి రామమూర్తి జిమ్నాజియంను ఏయూలో ఏర్పాటు చేశారు. వందల మంది విద్యారులు, ఉద్యోగులు వినియోగించుకుంటున్నారు. ఆధునాతన వ్యాయామ సామగ్రిని ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులు ఇక్కడ సిద్ధంగా ఉంచుతారు. విద్యార్థులకు ఇది ఉచితమే. అయితే తొలుత వారి అలాట్‌మెంట్ కార్డు నకలును అక్కడి సిబ్బందికి అందజేయాల్సి ఉంటుంది. ఆదివారం మినహా అన్ని రోజుల్లో నూ ఈ వ్యాయామశాల సేవలను వినియోగించుకోవచ్చు.






## డిగ్రీలను ఒడిసిపట్టు

ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ఒక పక్క పూర్తిస్థాయి విద్యార్థిగా కొనసాగుతూనే వేరే కోర్సులు చేసేందుకు వీలుంది. వర్సిటీ అందిస్తున్న డిప్లమో కోర్సుల్ని అభ్యసించవచ్చు. ఏయూ దూర విద్యా కేంద్రం అందిస్తున్న పలు డిప్లమా కోర్సుల్లో డిగ్రీలు పొందవచ్చు. దీంతో పాటు నృత్యం, సంగీతం, నటన రంగాలపై ఆసక్తి ఉన్న విద్యార్థులకు డిగ్రీలు చేసే సౌలభ్యం ఉంది. ఏయూ ఆర్ట్స్ కళాశాల ఆధ్వర్యంలో ఉన్న నృత్య, సంగీత, రంగస్థల విభాగాలు పలు డిప్లమా కోర్సులను అందిస్తున్నాయి. ఆయా విభాగాలు విడుదల చేసే నోటిఫికేషన్ల ఆధారంగా ఆసక్తి ఉన్నవారు ఈ కోర్సు లకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ప్రవే శాల వివరాలను విద్యార్థులు ఆయా విభాగాల్లో సైతం పొందవచ్చు.




## సమాజసేవ, క్రమశిక్షణ..:

విద్యతో పాటు యువతకు సమాజ సేవ, దేశభక్తిని పెంచేందుకు ఏయూ ఎన్‌ఎస్‌ఎస్, ఎన్ సీ సీ విభాగాలు పని చేస్తున్నాయి. వర్సిటీ ఎన్సీసీ విభాగంలో ఇంజినీరింగ్ విద్యార్థులతో పాటు పలు ఇంటిగ్రేటెడ్ కోర్సుల విద్యార్థులు చేరేందుకు అవకాశం ఉంది. ఈ ప్రవేశాలకు సంబంధించి వర్సిటీలోని అన్ని విభాగాలకు సర్క్యులర్ విడుదల చేస్తారు. దీని ఆధారంగా దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఎంపి కలు నిర్వహిస్తారు. ఏయూ ఎన్‌ఎస్‌ఎస్ విభాగానికి దేశం లో ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇక్కడి నుంచి ఎంతోమంది వాలంటీర్లు రిపబ్లిక్ డే పెరేడ్‌లో పాల్గొనడంతో పాటు రాజీవ్ గాంధీ నేషనల్ అవార్డులను సాధించారు. ఇక్కడ కార్యక్రమాలు కూడా అధికంగానే జరుగుతాయి. ఎన్‌ఎస్‌ఎస్ కార్యాలయం ఫోన్ : 0891-2704795. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ కార్యాలయాన్ని సంప్రదించడం ద్వారా ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్‌గా ఎంపిక కావచ్చు.




## రీడింగ్ రూమ్ @ 365 రోజులు

ప్రభుత్వ కొలువులే ధ్యేయంగా వర్సిటీలోకి అడుగుపెడుతున్న విద్యార్థులకు ఏయూ మంచి వేదిక. ఏయూలోని వీఎస్ కృష్ణ కేంద్ర గ్రంథాలయాన్ని ఆనుకొని 365 రోజులూ తెరచి ఉంచే రీడింగ్ రూంకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. విద్యార్థుల్లో ఇక్కడి వాతావరణం కొత్త ఉత్సాహం నింపుతుంది. నిరంతరం పుస్తకాలతో కుస్తీలు పడుతున్న సీనియర్ విద్యార్థులను చూసి జూనియర్ విద్యార్థులు ఎంతగానో ప్రేరణ పొందుతారు. లక్ష్యాలకు అనుగుణంగా ఇక్కడ చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించిన సీనియర్ విద్యార్థుల స్ఫూర్తిగా ముందుకు సాగుతారు. ఇక్కడ చదివే విద్యార్థులకు బయలు ప్రపంచం పట్టదు. టేబుళ్లపై దొంతర్లగా పేర్చిన పుస్తకాలు, చదివింది కళ్లు మూసుకొని నెమరు వేసుకుంటున్న విద్యార్థులే ఇక్కడ కనిపిస్తారు. ఖాళీ సమయాల్లో కొత్త విద్యార్థులు రీడింగ్ రూమ్ సేవలను వినియోగించు కోవచ్చు. పాఠ్యాం శాలకు సంబంధించిన పరీక్షలకు సిద్ధం కావడంతో పాటు ఉద్యోగ అవకాశాలను పొందే విధంగా సీనియర్ విద్యార్థులు సలహాలతో చదువుకునేందుకు రీడింగ్ రూమ్ మంచి వేదికగా నిలుస్తుంది.






## వీఎస్ కృష్ణా గ్రంథాలయం




ప్రపంచంలోని అత్యధిక పుస్తక సంపద ఉన్న గ్రంథాలయాల్లో ఏయూ వీఎస్ కృష్ణ గ్రంథాలయం ఒకటి. ఆంధ్రుల విజ్ఞాన భాండాగారంగా పేరొందిన ఈ గ్రంథాలయం ఎందరో నిరుద్యోగులను ఉన్న తంగా తీర్చిదిద్దింది. భారతావనిని విద్యా, విజ్ఞానం, పరిశోధన, సాంకేతిక రంగాలవైపు నడిపించిన ఘనత ఈ లైబ్రరీది. ఆంధ్రా ప్రాంతానికి వన్నెతెచ్చిన ఈ లైబ్రరీ ఆంధ్రుల సంస్కృతి, సంప్రదాయా లను, కట్టుబాట్లను ప్రతిబింబించే అనేక ఆనవాళ్లు తనలో నిక్షిప్తం చేసుకుంది. వీఎస్ కృష్ణ కేంద్రీయ గ్రంథాలయంలో సూమారు 5.3 లక్షల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ప్రధానంగా వర్సిటీలో ఉన్న కోర్సులకు అనుగుణంగా ఇక్కడ విద్యార్థులకు పుస్తకాలను ఉంచుతారు. ప్రతి సంవత్సరం విద్యార్థులు అవసరాలకు అనుగుణంగా విభాగాలు ఇచ్చిన సమా చారం మేరకు కొత్త పుస్తకాలను అందుబాటులోకి తెస్తారు. అన్ని రకాల పోటీ పరీక్షలకు సిద్ధ మయ్యే విధంగా పుస్తకాలు ఇక్కడ అందుబాటులో ఉంటాయి. గ్రూప్-1, 2, సివిల్స్ బ్యాంక్స్, ఆర్ఎల్బీ, డీఎస్సీ వంటి పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను పొందవచ్చు. ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధిలో ఉన్న ఎన్నో జర్నల్స్ ఇక్కడ దొరుకుతాయి. విద్యార్థులు వర్సిటీ నుంచి పొందిన అలాట్మెంట్, లైబ్రరీ ద్వారా విభాగాల విద్యార్థులకు అందించిన మల్టీ యూజర్ ఐడీ కార్డుల ద్వారా లైబ్రరీలోని పుస్తక విజ్ఞానాన్ని పొందవచ్చు. పుస్తకాలను వెంట తీసుకెళ్లే విధంగా లైబ్రరీ నాలుగు టిక్కెట్లను ఇస్తుంది. తీసుకెళ్లిన పుస్తకాలను 15 రోజులలోపు అందజేయాలి. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు లైబ్రరీ తెరిచే ఉంటుంది.



## యోగా విభాగం

ఆంధ్ర విశ్వ విద్యాలయం లోని యోగా విభాగం గత 40 ఏళ్లుగా సేవలు అందిస్తోంది. ఎంఏ యోగతో పాటు అనేక డిప్లమో కోర్సులను సెమిస్టర్, నాన్ సెమిస్టర్ విధానంలో అందిస్తుస్తోంది. డిగ్రీ విద్యార్హతతో ఒక సంవత్సరం పీజీ డిప్లొమా కోర్సు అందిసున్నారు. ఈ కోర్సులో 60 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఎంఏ, పీజీ డిప్లమో కోర్సుల ప్రవేశా లను ఏయూ అడ్మిషన్ల విభాగం నిర్వహిస్తుంది. ఇంటర్ విద్యార్హతతో 6 నెలల డిప్లొమా కోర్సు లను అందిస్తున్నారు. 60 సీట్లు అందుబాటులో ఉన్నాయి. రెండు బ్యాచ్లుగా ఈ కోర్సు అంది స్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో 6 నుంచి 7 గంటల వరకు తరగతులు నిర్వహి స్తారు. జనవరి, జూన్ నెలల్లో విభాగం విడుదల చేసే నోటిఫికేషన్ ఆధారంగా ప్రవేశం కల్పిస్తారు. 10వ తరగతి విద్యార్హతతో 3 నెలల యోగా కమ్యూనికేషన్ కోర్సు అందిస్తున్నారు. 60 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ప్రతి 3 నెలలకోసారి విభాగం విడుదల చేసే నోటిఫికే షన్ ఆధారంగా ఈ కోర్సులో చేరవచ్చు. ఆయా డిప్లమా కోర్సులను ఏయూలోని పలు విభాగాల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు వినియోగించుకునే అవకాశం ఉంది. ఒకపక్క రెగ్యులర్ కోర్సు చేస్తూనే ఈ డిప్లమో కోర్సులు చేయడం ద్వారా కెరీర్ ని అభివృద్ధి చేసుకోవచ్చు.







## అంతర్జాతీయ వేదిక..

ఏయూలో ఏర్పాటు చేసిన అమెరికన్ కార్నర్ ద్వారా అంతర్జాతీయ సమాజం ఆంధ్ర యూనివర్సిటీ విద్యార్థులకు అందుబాటులో ఉంది. యూఎస్ కాన్సులేట్ జనరల్ సహకారంతో ఇది సేవలందిస్తుంది. ఏయూలో ఏర్పాటుచేసిన ఈ అమెరికన్ కార్నర్ దేశంలోనే మూడవదిగా నిలిచింది. ఈ వేదిక నుంచి వర్సిటీ విద్యార్థులు అంతర్జాతీయంగా అనేక దేశాల యువత, విద్యావేత్తలు, ఉన్నతాధికారులతో సమావేశం కావచ్చు. విభిన్న రంగాల్లో వారి అభిప్రాయాలను ఆలోచనలు పంచుకోవచ్చు. గత ఏడాదిన్నరగా అమెరికన్ కార్నర్ విశేషమైన శావల అందిస్తుంది. అనేక సదస్సులు, సమావేశాలు, చైతన్య కార్యక్రమాలను ద్వారా వర్సిటీ విద్యార్థులను, ఆచార్యులను అంతర్జాతీయ సమాజంతో అనుసంధానిస్తుంది. ఈ సేవలను వర్సిటీ లోని విద్యార్థులందరూ వినియోగించుకోవచ్చు. ఆయా చర్చనీ అంశాలపై వారి కున్నా పరిజ్ఞానాన్ని అంతర్జాతీయ సమాజంతో పంచుకోవచ్చు.

American Corner
Visakhapatnam





## ఏయూ క్రీడా విభాగం






క్రీడల్లో రాణించాలని కాంక్షించే విద్యార్థులకు ఏయూ స్పోర్ట్స్ బోర్డ్ చక్కటి మార్గం చూపిస్తోంది. 50 కి పైగా క్రీడల్లో విద్యార్థులు ఇక్కడ వారి ప్రతిభను కనబరుచుకోవచ్చు. అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ తో కలిసి ఏయూ క్రీడ విభాగం క్రీడా పోటీలు నిర్వహణ, ఎంపికలు నిర్వహిస్తుంది. ఆ సంస్థ జారీ అయిన తేదీలకు అనుగుణంగా ఏయూ అంతర్ కళాశాల క్రీడా పోటీలు నిర్వహిస్తారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఆయా క్రీడల్లో యూనివర్సిటీ టీం గా ఎంపిక చేస్తారు. యూనివర్సిటీకి ఎంపికైన టీం ఏఐయు ఆధ్వర్యంలో జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ క్రీడల్లోనూ, ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ క్రీడల్లోనూ పాల్గొని రాణించాల్సి ఉంటుంది. ఏయూ క్రీడా విభాగం విడుదల చేసే నోటిఫికేషన్ ల ద్వారా ఆసక్తి గల విద్యార్థులు ఆయా క్రీడల్లోనూ, యూనివర్సిటీ టీం ఎంపికల్లోనూ పాల్గొనవచ్చు.

## ఏయూ ఆరోగ్య కేంద్రం

విద్యార్థులకు అనారోగ్య సమస్యలు తలెత్తితే సౌత్ క్యాంపస్ (0891-2844095), నార్త్ క్యాంపస్ 0891-2844104) వద్ద ఉన్న ఆరోగ్య కేంద్రాల్లో చికిత్స పొందవచ్చు హోమియో వైద్యశాల (0891-2844 106) కూడా అందు బాటులో ఉంది. వర్సిటీ గుర్తింపు కార్డులను వైద్య శాల సిబ్బందికి చూపించి రెండేళ్ల పాటు ఉచితంగా వైద్య సేవలు పొందవచ్చు. వివిధ పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందిస్తారు. చెవి, గొంతు, ముక్కు చర్మ సంబంధిత సమ స్యలకు సంబంధించి ప్రత్యేక వైద్య నిపుణులు అందుబా టులో ఉంటారు. అత్యవ సర పరిస్థితుల్లో అంబులెన్స్ సేవలను కూడా అందిస్తారు.




## మా భవిష్యత్‌కు పుష్కలమైన అవకాశాలు.

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో మా భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకునేందుకు పుష్కలమైన అవకాశాలు ఉన్నాయి. అకడమిక్‌గా ఏయూకు అంతర్జాతీయ గుర్తింపు ఉంది. దీంతో నేను ఏయూలో చదివేందుకు ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. ప్రస్తుతం నేను ఎంఎస్సీ ఫిజికల్ కెమిస్ట్రీలో చేరాను. లైబ్రరీ సేవలు, క్యాంపస్ ఇంటర్వ్యూలు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకొని నా భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని భావిస్తున్నాను.



– బార్గవి, అనకాపల్లి

## నైపుణ్యాన్ని పెంచుకుంటాను.

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అన్ని కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం నేను ఏయూలో ఎంఎస్సీ ఫిజికల్ ఓష్నోగ్రఫీలో చేరడం జరిగింది. ఏయూలోని అవకాశాలను వినియోగించుకొని నైపుణ్యాన్ని పెంచుకోవాలని నేను భావిస్తున్నాను. నా సబ్జెక్టుతో పాటు కంప్యూటర్ స్కిల్స్, లాంగ్వేజ్ స్కిల్స్‌పై నైపుణ్యం సాధించాలన్నతి నా ఆకాంక్ష. దీంతో పాటు ఏయూ ప్లైస్‌మెంట్ సెల్ ద్వారా ఉద్యోగం సాదించాలని భావిస్తున్నాను.



– ఆకుల జయలక్ష్మీ, సబ్బవరం

## ఏయూలో చదవాలని నా ఆకాంక్ష.

ఆంధ్ర విశ్వవిద్యాలయం గురించి చాలా సందర్భాల్లో గొప్పగా విన్నాను. ఏయూకి మన రాష్ట్రంలోనే కాకుండా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు ఉంది. దీంతో ఇక్కడ విద్యనభ్యసించాలని ఆకాంక్షించాను. బాగా చదివి ఎంఎస్సీ బొటనిలో సీటు సాధించాను. ఇక్కడ ఉన్న అవకాశాలను పూర్తిస్థాయిలో వినియోగించుకొని ఉన్నత ఉద్యోగం సాధించాలని భావిస్తున్నాను.



– బయ్యారం శ్రీవిద్య, ఏలూరు

# విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించండి

మొదటి పేజీ తరువాత

సంతృప్తిని ఇచ్చాయన్నారు. ఈ సందర్భంగా బి.వి.ఆర్ మోహన రెడ్డి మాట్లాడుతూ ఎంటర్‌ప్యూనర్‌షిప్‌ను మరింతగా ప్రోత్సహించాలని సూచించారు. దీనికి అవసరమైన వ్యవస్థను నిర్మాణం జరపాలని సూచించారు. నేడు డిగ్రీల కంటే నైపుణ్యాలు కలిగిఉండటం ఎంతో ప్రధానమన్నారు. అదే సమయంలో అధ్యాపకుల్లో నైపుణ్యాలను పెంపొందించడానికి కృషిచేయాలన్నారు. వీరు నిరంతరం తమ నైపుణ్యాలను పెంపొందించుకునే దిశగా కృషి జరగాలని సూచించారు. విద్యార్థులు తమ ఆసక్తికి అనుగుణంగా కోర్సులను, సబ్జెక్టులను ఎంపిక చేసుకునే స్వేచ్ఛను అందిచాలని సూచించారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి ఏయూలో క్రమశిక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ, ప్రతిభను ప్రోత్సహిస్తున్న విధానం వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి అందిస్తున్న సహకారంతో వర్సిటీలో చేపట్టిన అభివృద్ధిని వివరించారు. స్టార్టప్స్ ప్రగతి, చెయిర్ ప్రొఫెసర్స్, సిఎస్ఆర్ నిధులు సేకరణ తదితర అంశాలను వివరించారు. ఈ సందర్భంగా బి.వి.ఆర్ మోహన రెడ్డి చెయిర్‌ను ఏయూలో ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించి, ఏయూలో ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ చెయిర్ ప్రొఫెసర్ ఆచార్య జేమ్స్ స్టీఫెన్, ఇంక్యుబేషన్ సెంటర్ సిఈఓ రవి ఈశ్వరపు తదిరతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏయూ తరపున బి.వి.ఆర్ మోహన రెడ్డిని సత్కరించారు.




# డిసిఎంఎస్ బిఓఎస్ చైర్మన్‌గా ఆచార్య వెంకటేశ్వర్లు

## అభినందించిన ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి



ఏయూ న్యూస్, జనవరి : ఆంధ్రవిశ్వవిద్యాలయం కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా ఆచార్య పి.వెంకటేశ్వర్లు నియమితుల య్యారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి నుంచి నియామక ఉత్తర్వులను ఆయన స్వీకరించారు. అనంతరం విభాగంలో బిఓఎస్ చైర్మన్‌గా బాధ్యతను స్వీకరించారు. ఆచార్య వెంకటేశ్వర్లు ప్రస్తుతం ఏయూ డాక్టర్ వి.ఎస్. కృష్ణా గ్రంధాలయం గౌరవ గ్రంధాలయాధికారిగా సేవలు అందిస్తున్నారు. ఆర్ట్స్ కళాశాల వార్డెన్‌గా కూడా సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆచార్య వెంకటేశ్వర్లును విభాగ ఆచార్యులు, ఉద్యోగులు అభినందించారు.

## సినిమా బండి దర్శకుడు ప్రవీణ్‌కు

# వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి అభినందనలు



ఏయూ న్యూస్, జనవరి :ఆంధ్రవిశ్వవిద్యాలయం పూర్వవిద్యార్థి సినిమాబండి చిత్ర దర్శకుడు ప్రవీణ్ కాంద్రేగులను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి తన కార్యాలయంలో సత్కరించారు. బుధవారం వర్సిటీకి విచ్చేసిన దర్శకుడు ప్రవీణ్‌ను వీసీ వర్సిటీ తరపున సత్కరించారు. చిత్ర నిర్మాణానికి విశాఖ నగరం ఎంతో అనుకూలంగా ఉంటుందన్నారు. విశాఖనుంచి మంచి దర్శకులు రావాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చిత్ర సినిమాటో గ్రాఫర్ రోహిత్, వైజాగ్ ఫిలిం సొసైటీ గౌరవాధ్యక్షులు ఆచార్య ఎన్.ఏ.డి పాల్, కార్యదర్శి నరవ ప్రకాశ రావు పాల్గొన్నారు.

# వేమన పద్యాలు అక్షర సత్యం

## ఏయూలో వేమన జయంతి నిర్వహణ

## పూలమాల వేసి అంజలి ఘటించిన వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి



ఏయూ న్యూస్, జనవరి : వేమన పద్యాలు అక్షర సత్యాలుగా నిలుస్తాయని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అన్నారు. గురువారం ఉదయం ఏయూ పరిపాలనా భవనంలో నిర్వహించిన యోగి వేమన జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావితరాలకు వేమన పద్యాలను చేరువ చేయాలన్నారు. ఇటువంటి పద్యాలను చదవడం వలన చిన్నతనం నుంచి నైతిక విలువలను చిన్నారులలో పెంపొందించడానికి సాధ్యపడుతుందన్నారు. వేమన రాసిన పద్యాలను వివిధ భాషలలోనికి అనువదించడం జరిగిందన్నారు. విలువలకు అత్యధిక ప్రాధాన్యతను ఇచ్చే వ్యక్తిగా మన రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన రెడ్డి నిలుస్తున్నారన్నారు. వేమన చెప్పిన పద్యాలు నేటి సమాజానికి సైతం ఎంతో ఉపయుక్తంగా నిలుస్తున్న విధానాన్ని పద్యరూపంలో వివరించారు. సరళమైన భాషతో, ఎంతో ప్రభావవంతమైన సందేశాన్ని వేమన తన పద్యాలలో అందించారన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్, అకడమిక్ డీన్ ఆచార్య ఎన్.కిషోర్ బాబు, బిసిడిఈ కోఆర్డినేటర్ ఆచార్య ఎన్.ఏ.డి పాల్, ఎఫ్ఓ వనజారాణి, బి.వి రమణా రెడ్డి, ఎం.రాంబాబు, ఉద్యోగులు, విద్యార్థులు, పలువురు విదేశీ విద్యార్థులు పాల్గొన్నారు.

# నైపుణ్యాలు బోధనా పద్ధతులపై అవగాహన




ఏయూ న్యూస్, జనవరి : 21వ శతాబ్దపు నైపుణ్యాలు, బోధనా పద్ధతులు అనే అంశంపై ఆంధ్రా యూనివర్సిటీలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఉన్నత విద్యామండలి, కామన్‌వెల్త్ ఎడ్యుకేషనల్ మీడియా సెంటర్ ఫర్ ఏసియా, ఆంధ్రాయూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి. కృష్ణమోహన్ ముందుగా జ్యోతి వెలిగించి, ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆచార్య వి. కృష్ణమోహన్ మాట్లాడుతూ విద్యా విధానంలో వస్తున్న నూతన వరవడులకు అనుగుణంగా ఉపాధ్యాయులు తమ బోధన పద్ధతులను నిరంతరం సాన పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. నూతన విద్యా విధానంలో వచ్చిన మార్పులను అవగాహన చేసుకొని విద్యార్థులను తీర్చి దిద్దడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ముఖ్యంగా 21వ శతాబ్దంలో వచ్చిన నైపుణ్యాలను బోధన పద్ధతులను అవగాహన చేసుకొని, విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చి దిద్దాల్సిన భాధ్యత ఉపాధ్యాయులపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ దివాకర్‌రెడ్డి, హెచ్ఆర్‌డీసీ కేంద్రం డైరెక్టర్ ఆచార్య టి.వి.కృష్ణ, కార్యక్రమ సంచాలకులు సభాధ్యక్షుడు ఆచార్య ఎన్ఏడీ పాల్, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం నుంచి వచ్చిన సుమారు 55 మంది ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ముగిసిన ఫ్యాకల్టీ ప్రోగ్రామ్

ఏయూ న్యూస్, జనవరి :21 వ శతాబ్దపు నైపుణ్యాలు బోధన పద్దతులు శిక్షణ ఏయూ హెచ్ఆర్‌డిసి లో ఈనెల 21 ముగిసింది. ఈసందర్భంగా ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత ముఖ్యఅతిథిగా పాల్గొని శిక్షణలో పాల్గొన్న ఫ్యాకల్టి కి సర్టిఫికేట్లు ప్రధానం చేసారు. అనంతరం మాట్లాడుతూ ఇక్కడ శిక్షణ పోందిన ఫ్యాకల్టీ అందరూ తమ తమ కళాశాలలుకు వెళ్లి ఉపాద్యాయులకు శిక్షణ ఇచ్చే విధంగా ఉండాలన్నారు. అధ్యక్షత వహించిన హెచ్ఆర్‌డిసి డైరెక్టర్ ఆచార్య టివి కృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం వస్తున్న పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలని ఫ్యాకల్టి కి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఎన్. ఎ. డి పాల్ తదితరులు పాల్గోన్నారు.



# అభివృద్ధి చేసిన ఏయూ స్థలం లో మొక్కలు నాటే కార్యక్రమానికి ప్రణాళిక
# పర్యవేక్షణ చేసిన వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి

**ఏయూ న్యూస్, జనవరి :** ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ క్యాంపస్ లో ఇటీవల అభివృద్ధి చేసిన స్థలంలో మొక్కలు నాటేందుకు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి ప్రణాళికను సిద్ధం చేసారు. ఈసందర్భంగా ఈ నెల 20 న మద్దిలపాలెం నుంచి ఉమెన్ ఇంజనీరింగ్ హాస్టల్స్ వరకు ఉన్న అభివృద్ధి చేసిన స్థలాన్ని పరిశీలించారు. 73 ఎకరాలు ను అభివృద్ధి లోకి తీసుకువచ్చి ఇక్కడ స్థలంలో బౌండరీ చుట్టు వేలాది మొక్కలు నాటేందుకు వీసీ చర్యలు తీసుకుంటున్నారు. ఈసందర్భంగా ఇంజనీరింగ్ అదికార్లుకు పలు సూచనలు చేసారు. మొక్కలు ఎక్కడక్కడ నాటాలో వివరించారు. వాకర్స్ కి ట్రాక్ ఏర్పాటు క్రీడా మైధానాలు ఎక్కడక్కడ అభివృద్ధి చేయాలో ఇంజనీరింగ్ అధికార్లుకు సూచించారు. విద్యుత్ స్థంబాలు ఎక్కడ వేయాలో సూచించారు. ఎందుకు పనికి రానిగా ఉండే ఈ స్థలం ను వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి స్వచ్ఛంద సంస్థలు సహాకారం అందించాయి. ఈ స్థలం అనూహ్య రీతిలో ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి అభివృద్ధి చేయడంతో ఇక్కడ క్రీడాకారులు ఆనందం వ్యక్తచేస్తున్నారు. అలాగే తుప్పలు తో ఉండే ఈ స్థలం మహిళా హాస్టల్ ప్రాంగణంలో ఉన్నందున విద్యార్థుల తల్లిదండ్రులు కూడా వీసీ ఆచార్య ప్రసాదరెడ్డిని ప్రశంసించారు. ఇక్కడ స్థలం అభివృద్ధి చేయడంతోపాటు వర్సిటికి ఎటువంటి నిధులు ఖర్చుకాకుండా స్వచ్ఛంద సంస్థల సహాకారం తీసుకుని కోట్లాది విలువ చేసే స్థలం అభివృద్ధి చేయడం పట్ల వీసీ ఆచార్య ప్రసాదరెడ్డిని సర్వత్రా ప్రశంసలు కురిపించారు. ఏయూ ఇంజనీరింగ్ అదికార్లుతోపాటు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఛైర్ ప్రొఫెసర్ ఆచార్య ఎం జేమ్స్



స్టీఫెన్, ఏయూ వ్యాయామ విద్యా విభాగం డైరెక్టర్ ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆచార్య ఎన్. విజయమోహన్, డాక్టర్ కళ్యాణ్ తదితరులు ఉన్నారు.







## ఈ వారం

### బలబద్రుని నాగ సాత్విక్‌ని అభినందించిన వీసీ




**ఏయూ న్యూస్, జనవరి :** ఆంధ్రవిశ్వవిద్యాలయం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కాలేజ్ ఆఫ్ లా విద్యార్థి బలబధ్రుని నాగ సాత్విక్‌కి ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి ఆయన చాంబర్‌లో అభినందించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కాలేజ్ ఆఫ్ లా లో చదువుతున్న బలబద్రుని నాగ సాత్విక్ స్టార్టప్ మేనేజ్ మెంట్ ప్రధమ జర్నల్ లో లా పే పేపర్ ఆర్టికల్ ప్రచురణ జరిగింది. మహారాష్ట్ర నేషనల్ లా యూనివర్సిటి ముంబైలోని సెంటర్ ఫర్ లా అండ్ మేనేజ్‌మెంట్ ప్రచురణ చేసింది. ఈసందర్భంగా ఆంధ్రవిశ్వవిద్యాలయం నుంచి ప్రప్రదంగా లా లో స్టార్టప్ జనర్నల్ ప్రచురితమైన నేపథ్యంలో వీసీ తోపాటు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కాలేజ్ ఆఫ్ లా ప్రిన్సిపాల్ ఆచార్య విజయలక్ష్మి, కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కంప్యూటర్ ఇంజనీరింగ్ విభాగం హెడ్ ఆచార్య వెంకటరావు పాల్గొన్నారు.

**ఆంధ్రాయూనివర్శిటి స్టాఫ్ కో అపరేటివ్ సోసైటి లిమిటెడ్ క్యాలండర్ ను ఏయూ వీసీ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి ఆవిష్కరించారు. ఈసందర్భంగా సోసైటి అధ్యక్షులు డాక్టర్ ఎ.పల్లవి, తదితర ప్రతినిదులు పాల్గొన్నారు.**




# మన సాంస్కృతి చాలా పురాతనమైంది
# ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి

**ఏయూ న్యూస్, జనవరి :** మన సాంస్కృతి చాలా పురాతనమైందని, వాటిని రక్షించుకోవల్సి ఉందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి అన్నారు. కేంద్ర ఆదాయ పన్నులశాఖ కస్టమ్స్, సెంట్రల్ ఎక్సైజ్, సి.జి.ఎస్.టి ఆర్థిక మంత్రిత్వశాఖ సంయుక్తంగా విశాఖలోని ఆంధ్రవిశ్వవిద్యాలయం కన్వెన్సన్ సెంటర్ లో సాగరిక హాల్లో క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఈసందర్భంగా వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి, సీజీఎస్టీ కమిషనర్ ఎం.ఆర్.ఆర్.రెడ్డితో కలిసి జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంబించారు. ప్రతి ఏడాది క్రీడలు, కళలు, సాంస్కృతి, నృత్యం నాటకం వంటి ప్రదర్శనలు ప్రోత్సహించడానికి పోటీలు నిర్వహించడం అభినందనీయమని వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి తెలిపారు. సీజీఎస్టీ కమిషనర్ ఎం.ఆర్. ఆర్. రెడ్డి మాట్లాడుతూ 2022-23 సంవత్సరానికి గాను విశాఖపట్నం జీఎస్‌టీ జోన్‌కు సంబందించి దక్షిణ భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, పుదుచ్చేరి, కర్ణాటక, గోవా తదితర రాష్ట్రాల నుంచి కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారని తెలిపారు. సీజీఎస్‌టి చీఫ్ కమిషనర్ ఎన్. మొహమ్మద్ ఆలీ మాట్లాడుతూ ప్రతిభ కనప్బర్చిన వారిని గుర్తించేందుకు కమిటి ఎంపిక చేస్తుందని అన్నారు. వివిధ ప్రాంతాలు నుంచి వచ్చి కళాకారులు వివిధ రాష్ట్రాలకు చెందిన సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించడం ప్రశంస నీయమన్నారు. మిగత కళాకారులు వీరిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ జోన్ లకు చెందిన జీఎస్‌టీ అధికార్లు పాల్గొన్నారు.







# మీ అభివృద్ధి ప్రణాళిక మీరే రచించికోండి

## నూతన చరిత్రను లిఖించండి సైన్స్‌కళాశాల ప్రథమ సంవత్సరం విద్యార్థుల సమావేశంలో వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి







ఏయూన్యూస్, జనవరి : విశ్వవిద్యాలయం లో చేరిన తొలిరోజు నుంచి భవిష్యత్‌కు అవసరమైన అభివృద్ధి ప్రణాళిక రచించుకుని, అమలు చేసుకోవాలని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అన్నారు. గురువారం ఉదయం ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన సైన్స్ కళాశాల విద్యార్థుల తో నిర్వహిం చిన స్వాగత సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన చరిత్రను లిఖించే విధంగా పనిచేయాలన్నారు. నిరంతరం గ్రోత్ మైండ్‌సెట్‌ను కలిగి ఉండాలని సూచించారు. వర్సిటీలో ఉన్న కాలాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ కోర్సులు, పుస్తకాలు చదవడం, నూతన జ్ఞానాన్ని, నైపుణ్యాలను పొందడానికి కృషిచేయాలన్నారు. విద్యార్థులు ఉపాధిని సాధించడం, స్టార్టప్‌లుగా ఎదగడం అనే రెండు లక్ష్యాలను ఎంపిక చేసుకుని తదనుగుణంగా



పనిచేయాలని సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన రెడ్డి మన రాష్ట్ర యువత ఉపాధిని సృష్టించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తున్నారన్నారు. నేడు ఐడియాకు ఎంతో విలువు ఉందన్నారు. ప్రశ్నించ డం నుంచి ఆలోచన ఉద్భవిస్తుందన్నారు. సమాజంలో మనం చూచే సమస్యలే మనకు అవకాశాలను అందిస్తాయన్నారు. నేడు విశ్వవిద్యాలయంపై ప్రజల ఆకాంక్షల స్థాయిలు పెరిగిపోయాయన్నారు. ఆచార్యులు తమ బోధనతో విద్యార్థుల హృదయాలలో స్థానం పొందాల న్నారు. ఆచార్యుల్లో జవాబుదారీతనం పెరగాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతికత మానవ మేధస్సుకు సవాళ్లు విసురుతున్నాయన్నారు. విశ్వవిద్యాల యంలో అకడమిక్ క్యాలెండర్‌ను పటిష్టంగా అమలు చేస్తామ న్నారు. కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాస రావు, విభాగాధిపతులు, విభాగ ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మధ్యవర్తిత్వంతో వివాదాలు పరిష్కారం

## ఏయూలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చలమేశ్వర్ ఎండోమెంట్ లెక్చర్








▶ మొదటి పేజీ తరువాత

మధ్యవర్తిత్వం ఉపకరిస్తుందన్నారు. అదే సమయంలో మధ్యవరి_త్వం ఎంతో సంక్లిష్టమైన విషయమని, దీనికి ప్రత్యేక నైపుణ్యాలు, శిక్షణ అవసరమన్నారు. వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వం ఎంతో అనుకూలమైనదిగా నిలుస్తున్న విధానాన్ని పలు ఉదా హరణలతో వివరించారు. కాలహరణ నివారణకు ఇది అత్యుత్తమ సాధనంగా నిలుస్తుందన్నారు. మధ్యవర్తిత్వం మన దేశానికి కొత్తకాద న్నారు. రాజుల కాలం నుంచి ఇవి అమలులో ఉన్నా యని, బ్రిటీషు కాలంలో గ్రామ పెద్దలు ఈ బాధ్యతను నిర్వర్తించే వారన్నారు. నేడు దేశ వ్యాప్తంగా ఐదు కోట్ల వాజ్యాలు న్యాయ స్థానాలలో పరిష్కారం కోసం ఉన్నాయని, వీటిని పరిష్కరించడానికి తగినంత మంది న్యాయమూర్తులు లేరన్నా రు. వివాదాల కారణంగా సమాజంలో సోషల్ హార్మోని దెబ్బతింటోందన్నారు. మధ్య వర్తిత్వంపై అవగాహన కలిగి ఉండటం, తగిన నైపుణ్యాలను కలిగి ఉండాలని విద్యార్థులకు సూచిం చారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి మాట్లాడుతూ న్యాయ కోవిదులను తయారు చేసిన అత్యున్నత విద్యా కేంద్రంగా ఏయూ న్యాయ కళాశాల నిలుస్తోందన్నారు. సమస్యలు,



వివాదాలు పరిష్కారానికి మధ్యవర్తిత్వం మంచి సాధనంగా ఉపకరిస్తుందన్నారు. రాజ్యసభ మాజీ సభ్యులు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ మాట్లాడుతూ వారసత్వ సంపదగా ఏయూ న్యాయ కళాశాల నిలుస్తుందన్నారు. దీని ప్రతిష్టను పరిరక్షిస్తూ, గౌరవాన్ని ఇనుమడింపచేసే విధంగా యువత నడచుకోవాలని సూచించారు. న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి.విజయలక్ష్మి మాట్లా డుతూ ఏయూలో చదువుకుని అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఎదిగిన జస్టిస్ జాస్తి చలమేశ్వర్ పేరుతో ఈ ఎండోమెంట్ లెక్చర్‌ను నిర్వహించడం జరుగుతోంద న్నారు. కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో న్యాయ కళా శాల ఆచార్యులు, విశ్రాంత ఆచార్యులు, పరి శోధకులు, విద్యార్థులు తదితరులు పాల్గొ న్నారు. అనంతరం వర్సిటీ తరపున జస్టిస్ లావు నాగేశ్వర రావును సత్కరించారు.

# ప్రతి విద్యార్థికి హాస్టల్ సౌకర్యం

## వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి వెల్లడి .. నూతన విద్యార్థులకు అభినందనలు



**ఏయూన్యూస్, జనవరి :** ఆంధ్రవిశ్వవిద్యాలయం లో కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ, విద్యార్థులు వసతి కల్పించేందుకు ఆరు నెలలు ముందుగానే నాడు నేడు లో రిన్నోవేషన్ చేయించి ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి చర్యలు తీసుకున్నారు. ఈ విధానం వలన విద్యార్థులు అడ్మిసన్స్ అయిన వెంటనే సకాలంలో విద్యార్థులకు వసతి కల్పించకలిగారు. మహారాణిపేట లేడీస్ హాస్టల్స్ లో మహారాణి హిరాదేవి సదన్ పాతబ్లాక్ మదర్ థెరిసా బ్లాక్ సెంట్రల్ బ్లాక్, దుర్గాబాయి దేశ్ ముఖ్ బ్లాక్ నూతన బ్లాక్, సంయుక్త బుల్లయ్య బాల్ల ఆదునిక బ్లాక్, తాజా బ్లాక్ ఆవుల జయప్రద దేవి లేడిస్ హాస్టల్ ఏయూ ఔట్ గేట్, 414 సింగిల్స్ రూమ్‌లు, 48 డబుల్ రూంలు ఆరు మూడు సీట్లు బెడ్లు, 30 ఫోర్ సీట్లు బెడ్లు అందుబాటులో ఉన్నాయి. వీటితోపా టు నూతనంగా విద్యా తరంగణి విహార్ క్యాంపస్‌లో నే విద్యార్థులకు 300 వందల బెడ్లు భవనం అందుబాటులోకి తెచ్చి విద్యార్థులకు పూర్తి స్థాయిలో హాస్టల్ సదుపాయం కల్పించారు. విద్యా తరంగణి హాస్టల్ ఇక్కడ ఏర్పాటు చేయడం వలన సైన్స్ విద్యార్థిణిలకు ప్రాక్టికల్స్ చేసుకుని, హాస్టల్ కువచ్చి లంచ్ చేసుకుని మరలా వెంటనే ప్రాక్టికల్స్ హాజరయ్యే విదంగా ఇక్కడ వసతి కల్పించారు. ఈవిధానం వలన విద్యార్థులు చాలా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అలాగే క్యాంపస్‌లో సెక్యూరిటి కట్టు దిట్టం చేయడం జరిగింది.డాక్టర్ వి.ఎస్. కృష్ణా లైబ్రరీ కూడా విద్యా తరంగిణి విహార్ కు దగ్గరలో ఉన్నందున వీరంతా లైబ్రరీకి వెళ్లి చదివేందుకు చాలా ఉపయోగరంగా ఉంటుదని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి పేర్కొన్నారు.



విద్యాతరంగణి విహార్

ఆంధ్రవిశ్వవిద్యాలయం లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులు చదివేందుకు వివిధ రాష్ట్రాలు నుంచి వచ్చిన విద్యార్థులకు అపూర్వ స్వాగతం లబించింది. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి సూచనలు మేరకు పిజి కోర్సుల్లో అడ్మిషన్స్ పోందిన విద్యార్థులందరకూ హాస్టల్స్ లో వసతి కల్పించాం, అదనంగా హాస్టల్స్ వసతి ని కూడా కల్పించి విద్యార్థులకు అందించాం విద్యార్థులకు ఎటువంటి లోటు లేకుండా అన్నిఏర్పాట్లు కూడా సకాలం చేసాం. ఇంత సమర్థవంతంగా చేయడానికి కారణం వీసీ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి సూచనలు కారణంగా చీఫ్ వార్టెన్ డాక్టర్ ఎ పల్లవి తెలిపారు. విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులుకు కౌన్సిలింగ్ ఇచ్చారు. విద్యార్థులకు హాస్టల్స్ లో సదుపాయం, విద్యార్థులు అకడమిక్ పరంగా అభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించడం వంటి వివరాలు తెలిపారు.



లేడిస్ హాస్టల్ చీఫ్ వార్డెన్ డాక్టర్ ఎ. పల్లవి



ఆంధ్రవిశ్వవిద్యాలయం లేడీస్ హాస్టల్స్ లో జాయిన్ అయిన విద్యార్థులకుచీఫ్ వార్డెన్ డాక్టర్ ఎ. పల్లవి కౌన్సిలింగ్ ఇచ్చారు. సమయ పాలనతోపాటు వసతి గృహంలో క్రీడల సదుపాయం, విద్యార్థులకు మెనూ వివరాలు తెలియజేసారు. వసతి గృహల టైమింగ్ వివరించారు. లేడీస్ హాస్టల్ నుంచి ఏయూ క్యాంపస్ కు బస్సు సౌకర్యం,బస్సులు తిరిగే సమయం,గురించి విద్యార్థులకు చీఫ్ వార్డెన్ ఎ పల్లవి వివరించారు. వివిధ రాష్ట్రాలునుంచి ఇక్కడ అడ్మిసన్స్ పోందిన విద్యార్థుల తల్లిదండ్రలతో మాట్లాడి హాస్టల్ సదుపాయాలు, వర్సిటి లో చదివిన వారికి ఉపాధి అవకాశాలు, లైబ్రరరీ సౌకర్యాలు, వివరించారు.





నేను ఏయూ లో పూర్వ విద్యార్థిణిని ఇంగ్లీషులో పిజి చేసాను. మరలా మా పాప కు ఏయూలో నే అడ్మిషన్ లబించింది. ఇప్పుడు హిస్టరీ పిజిలో జాయిన్ అయింది. ఏయూలో చదవడం వలన ఉన్నత స్థానాలు లభిస్తాయి.అందువలనే ఇక్కడ చదివిస్తున్నాను. చీఫ్ వార్డెన్ హాస్టల్ సీటు వెంటనే కల్పించడం పట్ల అభినందనలు, మహిళల చదువు హాస్టల్ సదుపాయాలు కల్పించిన వీసీ గారిని అభినందన.

**పి రోజారాణి,**
**రాయగడ**



విజయవాడ నుంచి మా అమ్మాయికి ఎంఎస్సీ ఆర్గవనిక్ కెమిస్ట్రీలో అడ్మిషన్ లభించింది. ఆంధ్రవిశ్వవిద్యాలయంలో అడ్మిషన్స్ లభించడం పట్ల చాలా సంతోషంగా ఉంది. అలాగే వచ్చిన వెంటన్ ఎంతో బాగా హాస్టల్ చీఫ్ వార్డెన్, సిబ్బంది రిసీవ్ చేసుకున్నారు. వెంటనే హాస్టల్ సీటు కల్పించి మాకు టెన్సన్ తప్పించారు. వీసీ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి గారికి దన్యవాధాలు.

**పి.ఎస్. కుమారి**
**విజయవాడ**



శ్రీకాకుళం నుంచి వచ్చాను మా పాప బి ధరణిఏయూ బయో కెమిస్ట్రీలో విభాగంలో సీటు లభిచింది. మహారాణి పేట హాస్టల్ వచ్చిన వెంటనే హాస్టల్ సీటు పాపకు కల్పించారు. వీసీ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి గారికి చీఫ్ వార్డెన్ డాక్టర్ పల్లవి గారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. హాస్టల్ చాలా బాగుంది సిబ్బంది రీసివింగ్ బాగుంది.

**బి.గీత**
**శ్రీకాకుళం**



తూర్పుగోదావరి మండపేట నుంచి వచ్చాను. మా పాప కు ఆంధ్రవిశ్వవిద్యాలయంలో న్యూక్లియర్ ఫిజిక్స్ సీటు లభించింది. చాలా సంతోషంగా ఉంది. ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ఎంఎస్సీ అడ్మిషన్ రావడం తోపాటు వచ్చిన వెంటనే హాస్టల్ సీటు కూడా లభించింది. ఏయూలో మాపాప చదివించాలని చాలా కాలం నుంచి కోరిక ఉండేది. ఇప్పుడు తీరింది. ఏయూ వైస్ ఛాన్సలర్ ఆచార్య ప్రసాదరెడ్డి వారికి అభినందనలు.

**డి. గ్లోరి, తూర్పుగోదావరి,**

# ఆంధ్ర విశ్వ విద్యాలయం తెలుగు విభాగంలో ప్రజాకవి వేమన జయంతి వేడుకలు




ఏయూ న్యూస్, జనవరి : ఆంధ్రవిశ్వవిద్యాలయం తెలుగువిభాగంలో ప్రజాకవి వేమన జయంతి వేడుకలు ఘనంగానిర్వహించబడ్డాయి. తెలుగుశాఖాధ్యక్షులు ఆచార్య జర్రాఅప్పారావు అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో ముందుగా వేమనచిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆచార్య జర్రాఅప్పారావు మాట్లాడుతూ మన రాష్ట్రప్రభుత్వం వేమనజయంతిని అధికారకంగా ప్రకటించటమే కాక జయంతిఉత్సవాలను అన్నిచోట్లజరపాలని ప్రభుత్వం నిర్ణయించటం తెలుగుభాషా, సాహిత్యాభిమానుల అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ ఎల్బికళాశాల తెలుగు విశ్రాంతాచార్యులు డాక్టర్ మరడాన సుబ్బారావు మాట్లాడుతూ వేమన దేశియ కవిత్వంలో కవిత్వం అల్లి లోకరీతిని,నీతినీ తెలియజేసి ప్రజల జీవనాడిని తెలిపిన లోకకవిఅన్నారు. ప్రజలలో నిరంతరం తిరుగుతూ సమస్తవిషయాలపట్ల స్పృహను పెంచుకొని సమాజంలోని లొసుగులను స్వార్థపూరిత ప్రజాజీవన విధానాన్ని ఎండగడుతూ చక్కనిచిక్కని అలతిఅలతి పదాలతో పద్యాలల్లి సమాజచైతన్యానికి , సంఘసంస్కరణ దృక్పధానికి నాందిపలికారన్నారు. సమాజంలో కుటుంబ సంబంధ భాంధవ్యాలను ఎంతో పరిశీలనచేసిన వ్యక్తి అనివ్యక్తుల మానసిక చిత్తవృత్తిని అన్ని విధాల అవపోసన పట్టివారి వ్యక్తిత్వాలను మార్చుకొవలసిన ఆవశ్యకతను నొక్కివక్కాణించిన మానసికతత్త్వ వేత్తవేమన అనికొనియాడారు.ఆయన పద్యాలలో సూక్తులు దీపశక్తులుగా నిలిచివెలుగులందించాయన్నారు. వేమనకుసహాజంగాకవిత్వంఅబ్బటంచేతయతిప్రాసలువాటంతటవేసందర్భోచితంగావచ్చి ఆయాస్థానాలలో పొందికగా చేరాయన్నారు. మనిషితనకు తోడుగా ఉన్నాడను కోవటంబలం. ఆబలాన్ని భగవంతుడు గాభావిస్తూ మనిషిజీవించాడని అయితేకొంత మంది స్వార్ధపరులు ఆభగవంతుడ్ని భయంగుప్పెట్లో బంధించి దుర్మార్గమైన కులవ్యవస్థను, మూఢాచారాలను, మూఢవిశ్వాసాలను పాదుగొల్పి సమాజాన్ని తనవైపు తిప్పుకొని అధికారాన్ని చెలాయించటానికి ప్రయత్నిస్తే అటువంటి వారిని చివరకు భగవంతున్ని కూడవదలకుండా గొప్పగా తిట్టిపోసిన దైర్యసాహసి వేమన అని, వేమన తొటిమనిషికి సహాయపడటమే దైవత్వం అనిచెప్పిన మహానీయుడు అనితెల్పారు. మనుషుల్లో కులాలు గొప్పవనే ప్రాతిపదికను వదిలి గుణానికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలియజేసిన మొదటి వ్యక్తి వేమనన్నారు. ఆయన కవిత్వంలో సామెతలు, జాతీయాలు, నుడులు తెలుగుతనాన్ని ఉట్టిపడే విధంగా, సందర్భోచితమైన ఉపమానాలు లోకపరిశీలనానుభవాలకు సంకేతంగా వాడిన సమర్ధుడైనకవి వేమన అంటూ ఆయన కవితారీతులు గూర్చి వివరించారు. వేమనది సమతాతత్వం అనిసర్వ మానవ శ్రేయస్సే లక్ష్యంగా కవిత్వం అల్లారని అటువంటి వేమన పద్యాలను విదేశీయులు వెలికితీసి మనకు అందించారనివారిని తెలుగుజాతి మర్చిపోకూడదన్నారు. దాదాపు 40 దేశాలవాళ్ళు ఆయనపద్యాలను తమభాషల్లోకి అనువదించుకొని తెలుగుపద్యమాధుర్యాన్ని, విశేషమైన లోకరీతిని గ్రహించగలిగారన్నారు. గౌరవఅతిథిగా విచ్చేసిన ఆచార్య వెలమల సిమ్మన్న ప్రసంగిసూ వేమన సంఘసంస్కరణభావజాలాన్ని తన రచనలద్వారా సమాజానికి అందించిన మహానీయుడన్నారు. సమాజంలో ఆనాటి సాంఘీక జీవనంలో ప్రతిఅంశాన్ని స్పృజించి సమాజ అభివృద్ధి నిరోధక విధానాలను తూర్పారబడుతూ పదునైన ఈటెలవంటి ఆటవెలది పద్యాలలో సులభశైలిలో అక్షరాయుధాన్ని సంధించిఅశుకవితా ధారలు కురిపించిన ప్రజాకవి వేమన అని కొనియాడారు. మరోవిశిష్టఅతిథిగాహాజరైన సుధారాణి కొండపు (బోర్డ్ఆఫ్డైరెక్టర్, ఉత్తరఅమెరికా తెలుగుసమితి (నాటా)ఉత్తరఅమెరికా) మాట్లాడుతూ అమెరికా వంటి దేశాలలో తెలుగుసంస్కృతి సంప్రదాయాలను కాపాడు కుంటూ తెలుగువాళ్ళంతా వసుధైకకుటుంబంగా జీవిస్తున్నామని ముఖ్యంగా అక్కడపిల్లలకు విశ్వకవి వేమన పద్యాలను నేర్పిస్తూ ఆపద్యాలలోని మాధుర్యాన్ని నీతిబోధకవిషయాలను విశ్లేషిస్తూ వివరిస్తున్నామని విద్యార్ధులు సులభంగా పద్యాలునేర్చుకోవటానికి వీలుపడుతుందన్నారు. విదేశయులు కూడ వేమనపద్యాలను నేర్చుకుంటూ ఇంగీష్ రైమ్స్ పాడుకుటుంన్నట్లు మన పద్యాలు పాడుకుంటున్నారన్నారు.

ఈకార్యక్రమంలో సమైక్యభారతిజాతీయ సమన్వయకర్త పి కన్నయ్య, తెలుగు ఆచార్యులు డాక్టర్ అయ్యగారి సీతారత్నం, డాక్టర్ అన్నంశెట్టి ఈశ్వరమ్మ, డాక్టర్ బూసివెంకటస్వామి, డాక్టర్ కట్టెపోగు రత్నశేఖర్ , డాక్టర్ పెండ్యాల లావణ్య, ఆతుకూరివెంకటేశ్వర్లు(యోగి), బోధనేతరసిబ్బంది, పరిశోధక విద్యార్ధులు, స్నాతకోత్తర విద్యార్ధులు పాల్గొన్నారు.




# ఆలిండియా బాల్‌బాడ్మింటన్ పోటీల్లో ఏయూ పురుషుల జట్టు ప్రతిభ

## క్రీడాకారులను అభినందించిన వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి

ఏయూ న్యూస్, జనవరి :ఆంధ్రవిశ్వవిద్యాలయం బాల్ బాడ్మింటెన్ పురుషుల జట్టు ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్శిటి పోటీల్లో ప్రతిభ సాదించి కాంశ్యపతకాన్ని గెల్చుకుంది. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి ఏయూ కన్వెన్సన్ సెంటర్ లో బాల్ బాడ్మింటన్ క్రీడాకారులను అభినందించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతిభ సాదించిన క్రీడాకారులు ఉన్నత అవకాశాలు లభిస్తాయని వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రప్రభుత్వ క్రీడల్లో ప్రతిభ సాదించిన వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తుందన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన్ రెడ్డి క్రీడలకు అత్యధిక ప్రాధాన్యత కల్పించడం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన్ రెడ్డి పుట్టిన రోజు పురస్కరించుకుని



వైయస్ ఆర్ క్రికెట్ కప్ రెండు సార్లు విజయవంతంగా విశాఖ లో నిర్వహించామన్నారు. వర్సిటిలో కూడా క్రీడల్లో ప్రతిభ సాదించిన వారికి నగదు బహుమతి కూడా అందించడం జరుగుతుందని తెలిపారు. వచ్చెనెల ఏయూ లో ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్శిటి రోలర్ స్కేటింగ్ పోటీలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాటును ఏయూ స్పోర్ట్స్ బోర్డు నిర్వహిస్తుందన్నారు. ఏయూ వ్యాయామ విద్యావిభాగం డైరెక్టర్ ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆచార్య ఎన్ విజయమోహన్ మాట్లాడుతూ బ్యాడ్మింటెన్ పోటీల్లో ప్రతిభ సాదించి క్రీడాకారులు ఇద్దరుకు రైల్వే లో ఉద్యోగాలు పోందారన్నారు. ఏయూ వ్యాయామ విద్యా విభాగం హెడ్ డాక్టర్ ఎ. పల్లవి, ఏయూ కాలేజ్ ఆఫ్ లా ప్రిన్సిపాల్ ఆచార్య విజయలక్ష్మి, ఐఐపిఇ స్పోర్ట్స్ ఆఫీసర్ జి వెంకటేశ్వరరావు, క్రీడాకారులు పాల్గోన్నారు.



## ఏయూలో క్రాస్‌కంట్రీ పోటీలు

### పది కిలోమీటర్లు పరుగులో పోటీపడ్డ క్రీడాకారులు

ఏయూ న్యూస్, జనవరి, ఆంధ్రవిశ్వవిద్యాలయం క్రాస్ కంట్రీ ( పది కిలోమీటర్ల పురుషులు, మహిళల విభాగంలో యూనివర్సిటి ఎంపిక ఈనెల 20 న ఉదయం జరిగింది. ఈ సందర్భంగా ఏయూ వ్యాయామ విద్యా విభాగంలో జరిగిన ఈపోటీలను డాక్టర్ ఎల్ బి కళాశాల వ్యాయామ విద్యా విభాగం హెడ్ డాక్టర్ వై. శ్రీనివాసరావు ప్రారంబించారు. అనంతరం విజేతలకు ఏయూ వ్యాయామ విద్యా విభాగం హెడ్ డాక్టర్ ఎ. పల్లవి ముఖ్యఅతిథిగా పోల్గోని విజేతలకు బహుమతి ప్రధానం చేసారు. ఈ కార్యక్రమంలో ఏయూ వ్యాయామ విద్యా విభాగం డైరెక్టర్ ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆచార్య ఎన్ విజయమోహన్, డాక్టర్ వి.ఎస్. కృష్ణాకళాశాల వ్యాయామ విద్యా విబాగం హెడ్ డాక్టర్ వి. సంద్యారాణి, వ్యాయామ విద్యా విబాగం సిబ్బంది ప్రకాష్ తదితరులు పాల్గోన్నారు.




Chief Patron Prof. P.V.G.D. Prasada Reddy, Chief Editor Prof K.Samatha,Publisher Prof V. Krishna Mohan, Chief Advisor Prof James Stephen, Technical Adviser D.Sivakumar Reddy, Editorial Team Dr. Challa Rama Krishna, Prof. D.Lalitha Bhaskari, Dr. T.Vijaya Lakshmi, Mr. V.V.S.V Narasimham, Dr. Ch. Satyanarayana, Andhra University South Campus, Visakhapatnam, Andhra Pradesh, India, Pin: 530 003, Phone : 0891-284422